క్లుప్తంగా

ఓటరు జాబితా పరిశీలన



వివరాలు తెలుసుకుంటున్న ఆర్డీవో

కాసిపేట: మండలంలోని లంబాడితండా(డీ) గ్రామపంచాయతీలో మంగళవారం బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణ ఓటరు జాబితాను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ఓటరు జాబితాలో ఏమైనా అభ్యంతరాలున్న ఓటర్లు ఫిర్యాదు చేసుకొని సరి చేసుకోవాలన్నారు. సంబంధిత పంచాయతీ కార్యదర్శులు, బీఎల్‌వోలు ఓటర్ల ఫిర్యాదులను ఎప్పటికప్పుడు నమోదు చేసుకొని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాల్సిందిగా కోరారు.

అక్రమ ప్లాట్ల తొలగింపు

లక్సెట్టిపేట: మున్సిపల్ పరిధిలోని ఇటిక్యాల చెరువు సమీపంలో రియల్ ఎస్టేట్ వ్యాపారులు అక్రమంగా ప్లాట్లలో పోసిన మట్టిని మున్సిపల్, ఇరిగేషన్ అధికారులు మంగళవారం తొలగించారు. అనుమతులు లేకుండా చెరువు భూమిని ఆక్రమంచి, ప్లాట్లుగా ఏర్పాటు చేసుకుని మొరాన్ని పోయడంతో అధికారులు ఆ మొరాన్ని జేసీబీ, ట్రాక్టర్ల సాయంతో తరలించి పట్టణంలోని రోడ్లలో గుంతలు ఉన్న ప్రదేశాల్లో పోయించారు. కొంతమంది రియల్ వ్యాపారులు ఎలాంటి అనుమతులు లేకుండా ఇష్టారాజ్యంగా చెరువు ఎఫ్‌టీఎల్ భూమిని ఆక్రమించారని, వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇరిగేషన్ ఏఈ గౌతం, కమిషనర్ రాజశేఖర్ పాల్గొన్నారు.

వైభవంగా ప్రారంభమైన గోపాలకాలువ

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం పెద్దంపేట గ్రామ పంచాయతీలోని శ్రీభక్తాంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం శ్రీకృష్ణ గోపాలకాలువ వేడుకలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. వేద పండితులు శ్రీమంతుల సాయినాథాచార్యులు, గొల్లపల్లి సాయిక్రిష్ణాచార్యుల బృందం ఆధ్వర్యంలో గణపతి పూజ జరిపి బ్రహ్మ కళశస్థాపన, శ్రీకృష్ణుడి స్థాపన, నవగ్రహ, అష్టదిక్పాలకుల, పంచ బ్రాహ్మణుల స్థాపనా కార్యక్రమాలు వేద మంత్రోచ్ఛారణల మధ్య ఘనంగా నిర్వహించారు. అర్చకుడు తిరుపతి, ఆలయ కమిటీ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

‘వేతనంలో కోత పెట్టొద్దు’

శ్రీరాంపూర్: వరద బాధితుల సాయం కోసం సింగరేణి కార్మికుల వేతనాలను కోత పెట్టవద్దని హెచ్‌ఎంఎస్ నాయకులు కోరారు. ఈ మేరకు ఆ యూనియన్ ఆర్కే 7 గని ఫిట్ సెక్రెటరీ ఎస్. రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో గని మేనేజర్‌ను కలిసి మంగళవారం వినతిపత్రం అందజేశారు. గనులపై విరాళాల బాక్స్‌లను ఏర్పాటు చేయాలని, అప్పుడు కార్మికులు తమకు తోచిన విధంగా సహాయం అందిస్తారన్నారు. అంతే కాకుండా కంపెనీ సీఎస్ఆర్ నిధుల నుంచి కూడా వరద బాధితులకు సహాయం చేయాలన్నారు. కార్యక్రమంలో ఆ యూనియన్ నాయకులు చెవుల శ్రీనివాస్, ఆరెల్లి రమేష్ మీసాల మహేందర్, మల్లేష్ పాల్గొన్నారు.

విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండాలి

లక్సెట్టిపేట: విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గడికొప్పుల కిరణ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని మహాత్మాజ్యోతి బాపూలే గురుకుల కళాశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడారు. విద్యార్థుల భవిష్యత్ కోసం ప్రభుత్వం మంచి విద్యాబోధన అందిస్తుందని, ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలన్నారు. అనంతరం చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏజీపీ వేల్పుల సత్యం, సీనియర్ న్యాయవాదులు కొమిరెడ్డి సత్తన్న, లక్ష్మిరాజం, ప్రిన్సిపాల్ రోనాల్డ్ కిరణ్, సిబ్బంది సాగర్, విద్యార్థులు పాల్గొన్నారు.

హన్మాన్ బస్తీలో వ్యక్తిపై దాడి

బెల్లంపల్లి: బెల్లంపల్లి హన్మాన్ బస్తీకి చెందిన మద్రి రవికుమార్ అనే వ్యక్తిపై ఆవుల కొమురయ్య అనే వ్యక్తి దాడికి పాల్పడినట్లు వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో దేవయ్య తెలిపారు. తన గురించి తప్పుడు మాటలు మాట్లాడాడని కోపంతో సోమవారం రాత్రి రవికుమార్‌ను అటకాయించి కొమురయ్య దాడి చేసినట్లు చెప్పారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

నలుగురిపై కేసు

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీ సుభాష్‌నగర్ బస్తీలో నలుగురు యువకులపై పోలీసు కేసు నమోదైంది. టూటౌన్ ఎస్సై మహేందర్ కథనం ప్రకారం... సోమవారం రాత్రి గణేశ్ నిమజ్జనోత్సవంలో బందోబస్తు చర్యలు చేపట్టిన పోలీసుల విధులకు సంపత్, అరవింద్, వెంకటేష్, రవి ఆటంకం కలిగించినట్లు తెలిపారు. ఈ మేరకు సదరు యువకులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వెళ్లిరావయ్యా.. బుజ్జి గణపయ్య

- రెండో రోజు కొనసాగిన వినాయక నిమజ్జనాలు
- ఆది దేవుడికి అడుగడుగునా.. నీరాజనం
- కోలాటం, డప్పు సప్పుళ్ల మధ్య గంగమ్మ ఒడికి చేర్చిన భక్తులు
- బందోబస్తు నిర్వహించిన పోలీసులు

జైపూర్/మంచిర్యాలరూరల్(హాజీపూర్)/వేమనపల్లి/దండేపల్లి/మంచిర్యాలఅర్బన్: నవరాత్రులు పూజలందుకున్న గణపయ్యను భక్తులు సాగనంపారు. జిల్లాలో మంగళవారం రెండో రోజు నిమజ్జన కార్యక్రమాలు కొనసాగాయి. భక్తుల కోలాటం, దప్పు సప్పుళ్ల మధ్య గణపయ్యకు ఘన వీడ్కోలు పలికారు. ఊరేగింపుగా వెళ్లి పెద్దపల్లి-మంచిర్యాల జిల్లాల సరిహద్దు గోదావరి బ్రిడ్జి వద్ద నిమజ్జనం చేశారు. ప్రధానంగా మంచిర్యాల పట్టణ కేంద్రం నుంచి ఇందారం గోదావరికి నిమజ్జనం కోసం తరలించగా అర్ధరాత్రి నుంచి తెల్లారే వరకు సందడి వాతావరణం నెలకొంది. జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, శ్రీరాంపూర్ సీఐ మోహన్, జైపూర్ ఎస్సై శ్రీధర్, హాజీపూర్ ఎస్సై గోపతి సురేశ్ నేతృత్వంలో పోలీసులు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా బందోబస్తు నిర్వహించారు.



అంజనీపుత్ర సేవా సమితి ఆధ్వర్యంలో శోభాయాత్ర



జైపూర్: ఇందారం గోదావరి బ్రిడ్జిపై...





బొజ్జ గణేష్ మండలి వినాయకుడు..



ముఖారం చౌరస్తాలో భక్తుల సందడి



జైపూర్: నిమజ్జనం చేస్తూ...



సున్నంబట్టివాడ శివగణేష్‌మండలి ఆధ్వర్యంలో



జైపూర్: ఇందారం గోదావరి బ్రిడ్జిపై క్రేన్ సాయంతో నిమజ్జనం చేస్తూ..



హాజీపూర్ మండలం ముల్కల్లలో శివగణేష్ మండలి ఆధ్వర్యంలో శోభాయాత్ర



జిల్లా కేంద్రంలో నిమజ్జనానికి తరలుతున్న గణనాథుడు



జైపూర్‌లో...



మంచిర్యాలలో...

అమరవీరులకు విప్లవ జోహార్లు

- ఎర్రజెండా ఆవిష్కరించిన సీపీఐ శ్రేణులు



చెన్నూర్: జెండా ఎగురవేస్తున్న సీపీఐ శ్రేణులు

బెల్లంపల్లి/దండేపల్లి/బెల్లంపల్లిరూరల్/చెన్నూర్/పాతమంచిర్యాల: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వార్షికోత్సవ వారోత్సవాలు సీపీఐ ఆధ్వర్యంలో మంగళవారం కొనసాగాయి. ఈ సందర్భంగా జిల్లాలోని పలు మండలాల్లో ఎర్రజెండాను ఆవిష్కరించి అమర వీరులకు విప్లవ జోహార్లు అర్పించారు. సెప్టెంబర్ 17 తెలంగాణ విలీనం కాదు, విమోచన అంతకన్న కాదన్నారు. ముమ్మాటికీ విద్రోహ దినమని విమర్శించారు. ఆయా కార్యక్రమాల్లో సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఏ.లాల్‌కుమార్, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు మేకల రాములు, పీవోడబ్ల్యూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎం జ్యోతి, ప్రధాన కార్యదర్శి అరుణ, సీపీఐ పార్టీ సీనియర్ నాయకుడు మూల శంకర్ గౌడ్, సీనియర్ నాయకురాలు గుండా సరోజ, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యురాలు బి.పూర్ణిమ, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు రెడ్డి చరణ్, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు ఎం.వెంకటస్వామి, చెన్నూర్‌లో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా మిలాద్ ఉన్ నబీ

చెన్నూర్: పట్టణంలో మహమ్మద్ ప్రవక్త పుట్టిన రోజును పురస్కరించుకొని పెద్ద మసీదులో మిలాదు ఉన్ నబీ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ నెల 19న గురువారం ఐబీ చౌరస్తా నుంచి పట్టణంలోని పురవీధుల్లో ర్యాలీ అనంతరం, ఐబీ వద్ద రక్తదాన శిబిరం, అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ముస్లింలు తెలిపారు.

దరఖాస్తు చేసుకోండి

వేమనపల్లి: నీల్వాయిలో ఉన్న కేజీబీవీ పాఠశాలలో ఖాళీగా ఉన్న హెడ్ కుక్ పోస్టుకు ఆసక్తి కలిగిన స్థానిక మహిళలు దరఖాస్తులు చేసుకోవాలని మండల విద్యాధికారి పోటు తిరుపతిరెడ్డి తెలిపారు. నివాస ధృవీకరణ పత్రం, 10వ తరగతి ఉత్తీర్ణత, బోనోఫైడ్‌తో 24వ తేదీ లోపు మండల విద్యావనరుల కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

‘ఎమ్మెల్యేను విమర్శిస్తే ఊరుకోం’

చెన్నూర్: నియోజకవర్గాన్ని అభివృద్ధి పథం వైపు తీసుకెళ్తున్న చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామిని విమర్శిస్తే ఊరుకునేదిలేదని కోటపల్లి మాజీ జెడ్పీటీసీ పోటు చిన్న రాంరెడ్డి అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం మాట్లాడారు. ఎమ్మెల్యే గ్రామాలు సందర్శించడం లేదని, ప్రజా సమస్యలను పట్టించుకోవడం లేదని ప్రతిపక్ష పార్టీల నాయకులు చేస్తున్న ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు.

జాతీయ జెండా రెపరెపలు

- ఘనంగా ప్రజాపాలన దినోత్సవం

మంచిర్యాలటౌన్/చెన్నూర్/భీమారం/మందమర్రిరూరల్/బెల్లంపల్లిరూరల్/దండేపల్లి/చెన్నూర్‌రూరల్/నస్పూర్/రామకృష్ణాపూర్/వేమనపల్లి/కోటపల్లి/కాసిపేట/బెల్లంపల్లి/తాండూర్/జన్నారం/జైపూర్/భీమిని: సెప్టెంబర్ 17ను తెలంగాణ ప్రజాపాలన దినోత్సవంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో మంగళవారం జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ కార్యాలయాల్లో ఘనంగా నిర్వహించారు. పలుచోట్ల అధికారులు, ప్రజా ప్రతినిధులు జాతీయ జెండా ఎగురవేశారు. బెల్లంపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే గడ్డం వినోద్ జెండా ఆవిష్కరించారు. ఆయా కార్యక్రమాల్లో జిల్లా కేంద్రంలో డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ, మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్య, మంచిర్యాల ఉపవైద్యాధికారి అనిత, టీఎన్జీవోస్ భవన్‌లో జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి, భీమారంలో జిల్లా వ్యవసాయ అధికారి కల్పన, మందమర్రిలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, చెన్నూర్‌లో జిల్లా పంచాయతీ అధికారి డి.వెంకటేశ్వర్‌రావు, నస్పూర్‌లో మున్సిపల్ చైర్మన్ సురిమిల్ల వేణు, కమిషనర్ సతీష్, క్యాతనపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ జంగం కళ, మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ, బెల్లంపల్లిలో మున్సిపల్ చైర్‌పర్సన్ శ్వేత తదితరులు పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాలకు ఆ పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.



మంచిర్యాలటౌన్: జెండాకు వందనం చేస్తున్న డీసీసీ అధ్యక్షురాలు సురేఖ, ఎమ్మెల్యే ప్రేం సాగర్‌రావు



బెల్లంపల్లి: జెండాకు వందనం చేస్తున్న ఎమ్మెల్యే



రామకృష్ణాపూర్: జెండా ఆవిష్కరిస్తున్న జంగం కళ

పేదల సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం



సబ్సిడీ పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే

బెల్లంపల్లి/నెన్నెల: పేదల సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. బెల్లంపల్లి మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో మహాలక్ష్మీ పథకం కింద మంజూరైన గ్యాస్ సబ్సిడీ పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ శ్వేత, కమిషనర్ శ్రీనివాస రావు, పలువురు కౌన్సెలర్లు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, లబ్ధిదారులు పాల్గొన్నారు. నెన్నెల మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో మహాలక్ష్మీ పథకంలో భాగంగా అభయహస్తం, వంటగ్యాస్ సబ్సిడీ మంజూరు పత్రాలు, మదర్ ప్రతిభ స్వచ్ఛంద సంస్థ ద్వారా శిక్షణ పొందిన మహిళలకు ఉచిత కుట్టు మిషన్‌లను పంపిణీ చేశారు. కుశ్నపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ మాజీ సర్పంచ్ సంధ్య-మహేష్‌రెడ్డి మామ మల్లారెడ్డి ఇటీవల మృతి చెందగా, వారి కుటుంబాన్ని పరామర్శించారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి



చెన్నూర్‌లో పూజలు చేస్తున్న మహిళలు



జిల్లా కేంద్రంలో ఊరేగింపు

నెన్నెల/దండేపల్లి/భీమారం/మందమర్రిరూరల్/భీమిని/చెన్నూర్/పాతమంచిర్యాల: జిల్లా వ్యాప్తంగా మంగళవారం విశ్వకర్మ జయంతిని అంగరంగ వైభవంగా నిర్వహించారు. విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పంచరంగుల జెండాను ఆవిష్కరించారు. పలుచోట్ల మోటార్‌సైకిళ్లతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. విశ్వకర్మలు అన్నిరంగాల్లో రాణించాలని, ప్రపంచంలోనే మొట్టమొదటి శిల్పి భగవాన్ శ్రీ విశ్వకర్మ అని అన్నారు. విశ్వకర్మ ఆశీస్సులతో ముందుకు సాగాలని, యువత సైతం వృత్తిని గౌరవిస్తూ, దాని అభివృద్ధికి పాటుపడాలని సూచించారు. విశ్వకర్మ జయంతి ఒక కులానికి, మతానికి సంబంధించింది కాదని ఇది కార్మిక వృత్తికి సంబంధించినదని పేర్కొన్నారు. విశ్వకర్మల అభివృద్ధికి ప్రభుత్వం వడ్డీ లేని రుణాలు అందించాలని, ఆర్థికంగా వెనుకబడిన విశ్వకర్మ కులాల ప్రజలను అన్ని విధాలుగా ఆదుకోవాలని పిలుపునిచ్చారు. ఆయా కార్యక్రమాల్లో నెన్నెలలో విశ్వబ్రాహ్మణ సంఘం మండల అధ్యక్షుడు రవి, భీమారంలో మండల అధ్యక్షుడు సత్యనారాయణ, గౌరవ అధ్యక్షుడు మురళి, మందమర్రిలో అర్చకులు కుషకుమార్, విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు. చెన్నూర్ విశ్వ బ్రాహ్మణ భవన్‌లో విశ్వకర్మ పూజ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని సెవెన్ హిల్స్ పాఠశాల వద్ద విశ్వకర్మ విగ్రహ ప్రతిష్టాపన చేసి యజ్ఞహోమం పూజలు నిర్వహించారు. భక్తులు విశ్వకర్మను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం పట్టణ వీధుల్లో విశ్వకర్మ విగ్రహ శోభాయాత్ర నిర్వహించి గోదావరి నదిలో నిమజ్జనం చేశారు.

తెలంగాణ అమరులకు నివాళి

- ఘనంగా తెలంగాణ విమోచన దినోత్సవం

మంచిర్యాలరూరల్(హాజీపూర్)/లక్సెట్టిపేట/మందమర్రిరూరల్/రామకృష్ణాపూర్/భీమిని/కాసిపేట/చెన్నూర్/మంచిర్యాలటౌన్/దండేపల్లి/వేమనపల్లి: జిల్లా వ్యాప్తంగా తెలంగాణ విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకొని బీజేపీ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. జాతీయ జెండాలను ఎగురవేశారు. తెలంగాణ విముక్తి కోసం ప్రాణాలర్పించిన అమరులకు ఈ సందర్భంగా నివాళులర్పించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పుట్టిన రోజు సందర్భంగా పలుచోట్ల రోగులకు పండ్లు పంపిణీ చేశారు. బీజేపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



పండ్లు పంపిణీ చేస్తున్న రఘునాథ్



మందమర్రిలో జెండా ఆవిష్కరణ



రామకృష్ణాపూర్: జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం

- బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన

బెల్లంపల్లి/జన్నారం/చెన్నూర్/మందమర్రిరూరల్: రాష్ట్ర సచివాలయం ఎదురుగా దివంగత మాజీ ప్రధాన మంత్రి రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్ఠించడాన్ని నిరసిస్తూ మంగళవారం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బెల్లంపల్లి, చెన్నూర్, జన్నారం, మందమర్రిలో తెలంగాణ తల్లి విగ్రహానికి బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు క్షీరాభిషేం చేసి నిరసన తెలిపారు. తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేయకుండా రాజీవ్ గాంధీ విగ్రహాన్ని ప్రతిష్ఠించి తెలంగాణ రాష్ట్ర ఆత్మ గౌరవాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం కించపర్చిందన్నారు. ఈ తీరును తమ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. ఎన్నికల్లో ఆచరణకు సాధ్యం కానీ హామీలు ఇచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని విమర్శించారు. ఆయా కార్యక్రమాల్లో బెల్లంపల్లిలో మున్సిపల్ వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్, పార్టీ పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి రేవెల్లి విజయ్, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు వాజిద్, చెన్నూర్‌లో రాజా రమేశ్, దామోదర్‌రెడ్డి, రాంలాల్ గిల్డా, నవాజ్, రెవెల్లి మహేశ్, నాయిని సతీశ్, సమ్మిరెడ్డి, ఆరిఫ్, మానిశెట్టి శ్రీనివాస్, మందమర్రిలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు రవీందర్, టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు మేడిపెల్లి సంపత్ జన్నారంలో మాజీ జెడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్, మాజీ వైస్ ఎంపీపీ వినయ్‌కుమార్, బీఆర్ఎస్ రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



చెన్నూర్‌లో...

స్వచ్ఛత హీ సేవా పై అవగాహన

మందమర్రిరూరల్/మంచిర్యాలటౌన్/నస్పూర్/మందమర్రిరూరల్: కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సెప్టెంబర్ 17వ తేదీ నుంచి అక్టోబర్ 1వ తేదీ వరకు నిర్వహించే స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం జిల్లా వ్యాప్తంగా మంగళవారం ప్రారంభమైంది. మందమర్రి పాత బస్టాండ్ ఏరియాలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, మంచిర్యాలలో మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్య, మున్సిపల్ కమిషనర్ మారుతిప్రసాద్, నస్పూర్ మున్సిపల్ చైర్మన్ సురిమిల్ల వేణు, కమిషనర్ సతీశ్, మందమర్రిలో ఏరియాలోని జీఎం కార్యాలయం ఆవరణలో ఏరియా జీఎం దేవేందర్ ప్రారంభించారు. ప్రజలతో, కార్మికులకు స్వచ్ఛతపై అవగాహన కల్పించి, ప్రతిజ్ఞ చేయించారు. ప్రతి ఒక్కరూ స్వచ్ఛతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.